క్లుప్తంగా...

వడ్డీకాసులవాడా.. వేంకటేశ్వరా..



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను వివిధ నాణేలతో ప్రత్యేకంగా అలంకరించామని అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు తెలిపారు.

వరల్డ్ కప్.. పెట్ బాటిల్స్‌తో జాతీయ జెండాలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ శీతల పానీయాల సంస్థ కోకాకోలా ఇండియా పర్యావరణ పరిరక్షణ బాధ్యత నిర్వహణలో భాగంగా పోస్ట్ కన్స్యూమర్ పెట్ బాటిళ్లతో తయారు చేసిన వివిధ దేశాలకు చెందిన జాతీయ జెండాలను రూపొందించింది. ఈ జెండాల్ని ఉప్పల్‌లో జరిగే ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ పోటీల సందర్భంగా జాతీయ గీతం వేడుకల్లో వినియోగిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ పెట్ సీసాల్ని రీసైకిల్ చేసి వాటి నుంచి నూలు ఉత్పత్తి చేసి జెండాల తయారీలో ఉపయోగించినట్లు వివరించారు. ఒక జాతీయ జెండాను రూపొందించడానికి సుమారు 11,000 పెట్ సీసాలు రీసైక్లింగ్ చేయాల్సి వచ్చిందన్నారు.

శ్రీనగర్‌కాలనీ అధ్యక్షుడిగా బాలనర్సింహ



బాలనర్సింహను సన్మానిస్తున్న నాయకులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీనగర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా చిందం బాలనర్సింహ వంశరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పలువురు నాయకులు బాలనర్సింహను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ సంక్షేమానికి కృషిచేస్తానని బాలనర్సింహ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి, మచ్చ పాండుగౌడ్, ఏనుగు సీతారాంరెడ్డి, రమేష్‌యాదవ్, మల్లారెడ్డి, కొప్పుల కుమార్, ప్రభాకర్, సందీప్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

15 కేజీల గంజాయి పట్టివేత



మల్కాజిగిరి: ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ విభాగం మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీ రాత్రి ఈస్ట్ ఆనంద్‌బాగ్ నుంచి ఉప్పరిగూడకు గంజాయి తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు ఉప్పరిగూడ ప్రాంతంలో రెండు వాహనాలపై వెళ్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఒక కేసులో ఆర్టీసీ కాలనీకి చెందిన దామనీష్(20), ఆనంద్‌బాగ్‌కు చెందిన పి.సుమంత్‌యాదవ్(22) మరో కేసులో ఉప్పరిగూడకు చెందిన సయ్యద్ మహ్మద్(32), ఆర్టీసీ కాలనీకి చెందిన సీహెచ్ మహేష్(23)ను అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని, వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ భరత్‌భూషణ్, ఎస్‌ఐ ధన్‌రాజ్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి జైల్‌లో జైల్ అదాలత్

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల కోర్టు ఆధ్వర్యంలో శనివారం జైల్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్, చేవెళ్ల, సంగారెడ్డి, మేడ్చల్ కోర్టులకు చెందిన ఏడుగురు మేజిస్ట్రేట్‌లు 117 మంది ఖైదీలకు సంబంధించి 213 కేసులను పరిష్కరించినట్లు జైల్ అధికారులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేక న్యాయసాయం పొందలేని వారికి జైల్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందని జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్ అన్నారు. జైల్ ఉప పర్యవేక్షణాధికారి కృష్ణమూర్తి, శశికాంత్, జైలర్లు రామకృష్ణ, పరుశరాం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం పంచే.. ఆనందం నింపే..

- ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతూ..
- త్వరలో అందుబాటులోకి లక్ష్మీనగర్ పార్కు
- అన్ని రకాల సదుపాయాలతో సర్వం సిద్ధం
- బోడుప్పల్‌లో మరో ఐదు థీమ్ పార్కులు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని లక్ష్మీనగర్(హుడా) పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే హెచ్‌ఎండీఏ నిధులు రూ.40 లక్షలు కేటాయించగా పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇతర సదుపాయాలు కల్పించేందుకు గ్రీన్ బడ్జెట్ కింద రూ.35 లక్షలు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.68 లక్షలతో అన్నిరకాల సదుపాయాలు కల్పించేందుకు అధికారులు, పాలకవర్గం పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అన్ని రకాల సదుపాయాలను కల్పించి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.

హెచ్‌ఎండీఏ నిధులు రూ.40 లక్షలతో.. సుమారు మూడు ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న లక్ష్మీనగర్(హుడా) పార్కును హెచ్‌ఎండీఏ నిధులు రూ.40 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పచ్చదనం(గడ్డి), పచ్చని చెట్లు, ఔషధ మొక్కలు, పూల మొక్కలు, రకరకాల మొక్కలను పెట్టారు. సెల్ఫీ పాయింట్ వ్యూ మాదిరిగా మొక్కలను పెంచుతున్నారు. వాకింగ్ ట్రాక్‌ను పునర్ నిర్మాణం చేసి చుట్టూ పూల మొక్కలను పెంచుతున్నారు. అలాగే గ్రావెల్ పనులు చేస్తున్నారు.

రూ.కోటితో ఇతర సదుపాయాలు

లక్ష్మీనగర్ పార్కులో గ్రీన్ బడ్జెట్ కింద అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం, అధికారులు రూ.35 లక్షలు కేటాయించారు. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలతో ఆట వస్తువులు, షటిల్ కోర్టు నిర్మాణం, పార్కు ప్రహరీ గోడ, పెయింటింగ్, ఆర్చి నిర్మాణ పనులను చేపట్టనున్నారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉండగా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.



లక్ష్మీనగర్ పార్కు

బోడుప్పల్‌లో ఐదు థీమ్ పార్కులు ఏర్పాటు

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో తొలి విడత ఐదు థీమ్ పార్కులను అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం ముందుకు వచ్చింది. గ్రీన్ బడ్జెట్ కింద నిధులు కేటాయించి ఈ పనులు చేపట్టనున్నారు. రూ.30 లక్షలతో 1వ డివిజన్ క్రాంతికాలనీలో, 6వ డివిజన్ అశోక్‌నగర్‌లోని పార్కు స్థలంలో చిన్న పిల్లలకు ఆట వస్తువులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే మరో రూ.45 లక్షలతో 14వ డివిజన్ ఆర్‌ఎన్‌ఎస్ కాలనీలో.. 16వ డివిజన్ ఎస్‌బీఆర్ కాలనీలో.. 19వ డివిజన్‌లో లక్ష్మీనగర్‌లో రూ.45 లక్షలతో చిన్న పిల్లలకు ఆట వస్తువులను ఏర్పాటు చేయనున్నారు. అలాగే రూ.1.05 కోట్లతో 1వ డివిజన్‌లో పార్కు స్థలం, 6వ డివిజన్ అశోక్‌నగర్‌లో పార్కు స్థలం, 14వ డివిజన్ ఆర్‌ఎన్‌ఎస్ కాలనీలో పార్కు స్థలాన్ని గ్రీన్ బడ్జెట్ నిధులు అభివృద్ధి చేయనున్నారు.

త్వరలో పార్కు అందుబాటులోకి..



లక్ష్మీనగర్(హుడా) పార్కును త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. గ్రీన్ బడ్జెట్ కింద చేపట్టనున్న ఐదు థీమ్ పార్కులకు కేటాయించిన నిధులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేస్తాం. బోడుప్పల్‌లో పచ్చదనం పెరిగేలా పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం పంచేందుకు కృషిచేస్తాం.

– జి.వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ బోడుప్పల్

ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తా..



మాట్లాడుతున్న బండారి లక్ష్మారెడ్డి

- బీఆర్‌ఎస్ చర్లపల్లి డివిజన్ ఆత్మీయ సమ్మేళనంలో..
- బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఉద్యమ నాయకులు, కార్యకర్తలు నిరాశ పడకండి.. ఇంతకు ముందుకు వేరు.. ఇప్పుడు వేరు.. మీరంతా ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తానని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో శనివారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ చర్లపల్లి డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాకు టికెట్ రావడానికి పరోక్షంగా మీరే కారణం.. సర్వేలో మీరిచ్చిన ఫీడ్‌బ్యాక్ వల్లే సీఎం కేసీఆర్ నాకు ఉప్పల్ టికెట్ ఖారారు చేశారు. మీ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఉద్యమ కాలం నాటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులతో పాటు ప్రభుత్వ పథకాల్లో భాగస్వాములను చేస్తానంటూ ఉత్సాహం నింపారు. ఎలాంటి పదవులు లేకున్నా ఆపదలో ఉన్న వారికి తనవంతు సహకారం అందజేస్తూ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు మీకు తెలియనివి కాదన్నారు. ఉప్పల్ టికెట్‌పై సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన వెంటనే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను ఇండస్ట్రియల్ నుంచి రెసిడెన్షియల్ జోన్ మార్పిడి, వంద పడకల ఆస్పత్రి మంజూరు, అలాగే నియోజకవర్గంలో జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పన కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. రెండు నెలలు కష్టపడి పనిచేసి నా గెలుపు కోసం కృషి చేయండి.. మీరంతా ఆత్మాభిమానంతో జీవించేలా మీ జీవితాల్లో మార్పు తీసుకువస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, పార్టీ డివిజన్ అధ్యక్షుడు డప్పు గిరిబాబు, సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, బొడిగె ప్రభుగౌడ్, జౌండ్ల సత్తిరెడ్డి, హరినాథ్, నేమూరి మహేష్‌గౌడ్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న బండారి లక్ష్మారెడ్డి

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

మల్లాపూర్: ఆశీర్వదించి ఎన్నికల్లో గెలిపిస్తే ఉప్పల్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని ఉప్పల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ విస్తృత స్థాయి సమావేశం మల్లాపూర్ వీఎన్‌ఆర్ గార్డెన్‌లో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న రెండు నెలలు కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయించేలా ప్రచారం చేయాలన్నారు. తనను గెలిపిస్తే మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, కటార్ల భాస్కర్, ఎస్వీ శివకుమార్, బోదాసు లక్ష్మీనారయణ, హమాలీ శ్రీను, కుంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజే.. రూ.2.37 కోట్లు..



చిలుకానగర్ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

- పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నా
- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: పార్టీలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్ డివిజన్‌లో పలు కాలనీల్లో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. దాదాపు రూ.2.18 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటూ అనేక సేవలు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో రాఘవేంద్రనగర్ కాలనీలో కల్వర్టుకి రిటర్నింగ్‌వాల్ నిర్మాణానికి రూ.21 లక్షలు, మహిళా భవనం మరమ్మతులకు రూ.9.60 లక్షలు, బాలాజీ ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.19 లక్షలు, కళ్యాణపురి నుంచి సీతారామకాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.80 లక్షలు ఇలా దాదాపుగా ఒక్కరోజే రూ.2.37 కోట్లతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని సూచించారు. బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, జగన్, బాలు, వీబీ నర్సింహ, జల్లీ మోహన్, పిట్టల నరేష్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఉప్పల్ డివిజన్‌లోని పలు కాలనీల్లో..

ఉప్పల్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.18 లక్షల అంచనా వ్యయంతో సాయిరాంకాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు కాలనీల్లో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తుమ్మల రాజేందర్‌రెడ్డి, దేవిరెడ్డి, వర్కాల మదన్‌గౌడ్, బుచ్చిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, కట్ట రాజేందర్ పాల్గొన్నారు.

కేఎల్‌రెడ్డి నగర్‌లో సీసీ రోడ్డు పనులకు..

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్‌రెడ్డినగర్ కాలనీలో ఎమ్మెల్యే నిధులు రూ.34 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్, కేఎల్ రెడ్డినగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీఎస్‌పీటీఎంఎం సంఘ ద్వితీయ రాష్ట్ర మహాసభ

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు బీఎంఎస్ అనుబంధంగా ఉన్న తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ సంఘ్ ద్వితీయ మహాసభ జరుగుతుందని సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ తెలిపారు. అధిక సంఖ్యలో డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దు

ఉప్పల్: క్షణికావేశంలో ఎవరూ ఆత్మహత్యలకు పాల్పపడవద్దని లైఫ్ సొసైటీ ఫౌండర్ ఇమాన్యుయెల్ ముదిరాజ్ తెలిపారు. ది లైఫ్ సొసైటీ, క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి సహకారంతో శనివారం ఉప్పల్ గాంధీనగర్ నుంచి రింగ్ రోడ్డు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం అన్నారు. ర్యాలీలో జేరుసలేం మత్తయ్య, పోచయ్య, సుధాకర్ జార్జ్, గోన పిలిప్ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఐడియాలతో ఉన్నత స్థానాలకు..



రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్ ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణంలో శనివారం యంగ్ ప్రెన్యూయర్స్ ఇంటర్ స్కూల్ పోటీలను నిర్వహించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఇంటర్నేషనల్ గ్లోబల్ స్కూల్, నాసర్ గరల్స్ స్కూల్, ఇండస్ హైస్కూల్‌తో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హాజరైన ముఖ్య అతిథులు, న్యాయ నిర్ణేతలు మాట్లాడుతూ ఇటువంటి పోటీలు యువతలో ఉన్న ఆలోచనలను వెలికి తీసి వ్యవస్థాపక సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బోర్డు సభ్యురాలు శ్రీనిధి, ఫని కొండేపూడి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న బీవీ మధుసూదన్‌రావు

అల్వాల్: న్యాయవాదులు, న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించినప్పుడు న్యాయవాద వృత్తికి పేరు తీసుకొచ్చిన వారమవుతామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.మధుసూదన్‌రావు అన్నారు. శనివారం మల్కాజిగిరిలో యువ న్యాయవాదులకు ఐఎల్‌పీఏ(ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోషియేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత న్యాయ తరగతులను ఆయన ప్రారంభించారు. న్యాయవాద వృత్తి కత్తిమీద సాములాంటిదని, అయినా బాధితుడికి న్యాయం జరగడానికి వాదనలు ఉండాలన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి రఘునాథ్‌రెడ్డి, కిరణ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి పూజ, తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, మల్కాజిగిరి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నిస్తే తట్టుకుంటలేరు

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: సమస్యలపై బస్తీవాసులు, కాలనీవాసులు ప్రశ్నిస్తే బీఆర్‌ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. నాచారం రాఘవేంద్రనగర్‌లో అభివృద్ధి పనుల శంకుస్థాపన సమయంలో బీజేపీ నేత పాతగాని గోపాల్‌గౌడ్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బేతి సుబాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత సాయిజెనోశేఖర్‌కు జరిగిన వాగ్వాదం విధితమే. బీఆర్‌ఎస్ నేతల దౌర్జన్యాన్ని నిరసిస్తూ శనివారం నాచారం నేతాజీ విగ్రహం వద్ద బీజేపీ నేతలు నిరసన ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభాకర్ హాజరయ్యారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, దాడులను వివరించారు. గోపాల్‌గౌడ్‌పై సాయిజెనోశేఖర్ దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం బీజేపీ నేతలు నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అంపాల పద్మారెడ్డి, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, రాగిడి మోహన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, అనితారెడ్డి, దయాగౌడ్, సుమన్‌శర్మ, హన్మంత్, నవీన్, గోపి, చందమౌళి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఫారెస్టు అధికారి అరెస్టు



కిరణ్‌కుమార్

కుషాయిగూడ: ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలిపిస్తానంటూ మోసానికి పాల్పడుతున్న ఓ నకిలీ ఫారెస్టు అధికారిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శనివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర, ఖమ్మంకు చెందిన కొనకంచి కిరణ్‌కుమార్(39) ఖమ్మం ఫారెస్టు డిపార్టుమెంట్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసి మానేసిన కిరణ్‌కుమార్ నకిలీ ఫారెస్టు అధికారిగా అవతారమెత్తాడు. డిపార్టుమెంట్ యూనిఫాం ధరించి అక్కడక్కడా వాహనాలను తనిఖీ చేస్తూ అందినకాడికి దండుకుంటూ వస్తున్నాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయకులను మోసం చేయడం మొదలు పెట్టాడు. ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఇప్పిస్తానంటూ చర్లపల్లి బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన బోయిని సుభాష్ వద్ద రూ.4.5 లక్షలు తీసుకొని ముఖం చాటేశాడు. దీంతో బాధితుడు చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని యూసుఫ్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. రూ.26 లక్షలకు పైగా వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అతడిని రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్ మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడిగా జీడీ సంపత్‌గౌడ్



మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి డివిజన్ అధ్యక్షుడిగా జి.డి.సంపత్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మల్కాజిగిరిలో డివిజన్ నాయకుల సమావేశం జరిగింది. బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్‌లో సీనియర్ నాయకుడు జీడి శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందడం, డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్ బీఆర్‌ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. శ్రీనివాస్‌గౌడ్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని, పార్టీని బలోపేతం చేసేందుకు ఆ కుటుంబానికి చెందిన సంపత్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నామన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు జి.డి.సత్యనారాయణగౌడ్, సిరిగిరి నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, నవీన్‌గౌడ్, సానాది శంకర్, కొండల్‌గౌడ్, పోల్కం వెంకటేష్, నాగేందర్‌గౌడ్, మహేందర్, అవినాష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.